بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 20.01.2017 (Telugu)**

## ప్రతి పనిలో ఉన్నత ఫలితాలను సృష్టించుటకు నిలకడ తప్పనిసరి
## ఉపశాఖలు , జమాఅత్ వ్యవస్థ కూడ తమ పనిలో ప్రత్యేకంగా మన జన్మ ఉద్ధేశముగా అల్లాహ్ తఆలా నిర్ణయించిన పనిలో కాలముతో పాటు అలసత్వము, బలహీనత బదులు ప్రతి రోజు ప్రగతి వైపు తీసుకెళ్లే విధముగా ప్రణాళిక రచించవలెను

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 27.01.2017 తేదీన - మస్జిద్ బైతుల్ ఫుతూహ్ లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

గత ఖుత్బాలో నేను నమాజుల ప్రాముఖ్యత, వాటిని సలుపుట వైపు సూచించితిని. చాలా మంది నాకు వ్యక్తిగతంగా ఉత్తరములు వ్రాసి తమ అలసత్వముల పట్ల పశ్చత్తాపమును వ్యక్తపరచిరి. వాస్తవముగానే ఈ విషయములో సోమరితనము యున్నది, ఇక ముందు గట్టి కార్యాచరణ రూపొందించుచున్నాము, సోమరితనమును దూరము చేయుటకు ఇన్ షా అల్లాహ్ సంపూర్ణముగా ప్రయత్నించెదమని అనేక ప్రాంతాల నుండి జమాఅత్ వ్యవస్థ, ఉపశాఖల ఉత్తరములు కూడా వచ్చినవి. అల్లాహ్ తఆలా వీరిందరిని ఇందుకు అనుగ్రహించుగాక! మన మస్జిదులు వాస్తవంగానే నిండు కుండల్లా కనిపించుగాక! కాని ప్రతి పనిలో ఉన్నత ఫలితాలను పొందుటకు నిలకడ తప్పనిసరని నిర్వహకులు గుర్తుంచుకోవలెను. మనలోని చాలా మంది ఆరంభములో ఎంతో ఉద్రేకముతో పనిని మొదలు పెడతారు. కాని కొంత కాలము తరువాత సోమరితనము మొదలవుతుంది. ఇది మానవ స్వభావం. సభ్యులలో సోమరితనము సమంజసము కాకున్నను అంత ప్రమాదకర ఫలితాలకు దారి తీయదు. కాని వ్యవస్థలో సోమరితనము చాలా ప్రమాదకరమైనది. సభ్యులకు సూచించే వ్యవస్థయే మందగించినచో లేదా తన పనిలో అయిష్టతను కనబర్చినచో సభ్యుల సంస్కరణ కూడ కష్టమైపోవును.

కావున ఉపశాఖలు కూడ జమాఅత్ వ్యవస్థ కూడ తమ పనిలో ప్రత్యేకంగా మానవ జన్మ ఉద్ధేశముగా అల్లాహ్ తఆలా నిర్ణయించిన పనిలో కాలముతో పాటు అలసత్వము, సోమరితనము బదులు ప్రతి దినము అభివృద్ధి వైపు తీసుకెళ్లుటకు కార్యాచరణ రూపొందించవలెను. మన ప్రార్ధనల ప్రగతియే మనకు సఫలములనందించును. ఇది ఎంతో ముఖ్యమైన విషయము. ఈ విషయములో వ్యవస్థ మొత్తం చిత్తశుద్ధులు కావలసిన అవసరమున్నది. లజ్న ఇమాఇల్లాహ్ కూడ ఈ విషయములో తమ పాత్ర పోషించవలెను. గృహములలో పిల్లల నమాజులను పర్యవేక్షించవలెను. వారికి నమాజుల అలవాటు వేయుట, పురుషులు, నవయువకులు మస్జిదులకు వెళ్లేందుకు వరుసగా సూచించుట అనేది స్త్రీల కర్తవ్యం. స్త్రీలు తమ పాత్ర పోషించినచో అసాధారణ మార్పు ఏర్పడవచ్చును. నమాజుల గురించి మాకె ఏమి చెప్పకండి, మాతో ఏమి అడగకండి, ఇది మాకు, దేవునికి సంబంధించిన విషయమని చెప్పే వారి ఆలోచన సవరణ గురించి నేనొక విషయము చెప్పదలచినాను. మేము మా భర్తలకు శ్రద్ధ కలిగించినచో వారు మాతో జగడమాడడం ప్రారంభిస్తారని చాలా మంది స్త్రీల ఫిర్యాదులు వచ్చుచుండును. ఇటువంటివారికి నేను చెప్పదలచినదేమనగా నిస్సందేహముగా ఇది దాసుని, దేవునికి సంబంధించిన విషయమే. కాని శ్రద్ధ కలిగించుట జమాఅత్ వ్యవస్థ కార్యము, ఇలాగే భార్యల పనియే కాదు కర్తవ్యము కూడ. నమాజ్ కొరకు ఎవరు ముందుగా నిద్ర లేస్తారో వారు ఇతరులను నిద్ర లేపాలి, లేవనిచో లేదా అసలత్వము ప్రదర్శించినచో నీళ్ల చుక్కలు చల్లాలని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం భార్యాభర్తలను ఆదేశించిరి. ఇటువంటి విషయములలో స్వతంత్రులము, మాకు దేవునికి సంబంధించిన విషయమనే భావన పొరపాటైనది. ఏ వ్యవస్థతో మీరు ముడిపడియున్నారో అది తన సంఘ పరిశీలన కొరకు నమాజులు సలుపుట గురించి ప్రశ్నించినచో అసహనం, కోపమునకు గురయ్యే బదులు సహకరించవలెను. ఏది ఏమైనప్పటికి నమాజ్ ప్రాముఖ్యత ప్రతి ఒక్కరికి తెలియవలెను. ఇందుకు ఎంతో శ్రద్ధతో అల్లాహ్ తఆలా, అతని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశము మేరకు ఆచరించుటకు కృషి చేయవలెను.

ఈ సూచన తరువాత నమాజుల గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం కొన్ని ఆదేశములను ప్రవేశపెట్టెదను. సాధారణంగా అవి ఫిఖ్హీ సమస్యలకు చెందినవి. ఈ విషయములలోని ఒకటి రఫ యద్దైన్ (రెండు చేతులు లేపుట) గలదు. అనగా ప్రతి తక్బీర్, ప్రతి కదలిక సమయమున చేతులు లేపి చేవులకు ఆనించుట. రఫ యద్దైన్ గురించి

వారిట్లనిరి. ఎవరైనా ఇలా చేసినా చేయకున్నా ఇందులో అభ్యంతరమేమి లేదు. హదీసులలో ఇది రెండు రకాలుగా ప్రస్తావించబడినది. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒకప్పుడు రఫ యద్దైన్ చేసి తరువాత విడిచిపెట్టినారని తెలుస్తున్నది.

నాతో మియాఁ అబ్దుల్లాహ్ సనోరి గారిట్లు తెలిపినారని హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారు వ్రాసిరి. ఆరంభములో నేను చాలా గట్టిగా ఘైర్ ముఖల్లద్‌గా యుంటిని. రఫ యద్దైన్, గట్టిగా ఆమీన్‌ను ఎంతో పకడ్బందీగా పాటించేవాడిని. హజ్రత్ గారితో భేటి అయిన తరువాత కూడ చాలా కాలము వరకు నేను దీనిని పాటించినాను. చాలా కాలము తరువాత ఒక సారి నేను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం నేతృత్వంలో నమాజ్ చదివిన తరువాత నమాజ్ తరువాత చిరునవ్వుతో మియాఁ అబ్దుల్లాహ్ ఇప్పటికి ఈ సున్నత్ చాలా కాలము వరకు పాటించినావని నాతో అనిరి. రఫ యద్దైన్ వైపు సంజ్ఞ యుండెను. ఆ రోజు నుండి నేను రఫ యద్దైన్ చేయడం మానివేయడమే కాక గట్టిగా ఆమీన్ అనడంను కూడ విడిచిపెట్టినానని మియాఁ అబ్దుల్లాహ్ గారు తెలిపిరి. మియాఁ అబ్దుల్లాహ్ గారింకా ఇట్లు తెలిపిరి. రఫ యద్దైన్ చేసినట్లు గట్టిగా ఆమీన్ అన్నట్లు హజ్రత్ గారిని నేనెన్నడు చూడలేదు. బిస్మిల్లాహ్‌ను కూడ గట్టిగా చదివినట్లు వినలేదు. మియాఁ అబ్దుల్లాహ్ గారు చెప్పినట్లే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పద్ధతి యుండెనని వినయడైన నేను తెలుపుచున్నానని మిర్జా బషీర్ అహ్మద్ గారు తెలిపిరి.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. కాని అహ్మదీయులమైన మనలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కాలములో కూడ, వారి తరువాత కూడ కొనసాగుచున్న పద్ధతి ఏమనగా ఈ విషయములలో ఒకరు మరొకరిని నిందించరు. కొందరు కొద్ది గట్టిగా ఆమీన్ అని అంటారు. కొందరనరు. కొందరు రఫ యద్దైన్ చేస్తారు. అధికులు చేయరు. ఇప్పుడిప్పుడే క్రొత్తగా వచ్చిన వారు, ఇందుకు అలవాటు పడినవారు తప్ప ఇప్పుడైతే అసలే చేయరు. వారు మెల్లి మల్లిగా విడిచిపెట్టుతారు.

నమాజులో చేతులు కట్టుకొని వ్యక్తి నిలబడినప్పుడు అనగా ఖయామ్‌లో ఎక్కడ చేతులు కట్టుకోవలెననే మరో ప్రశ్న కూడ ఉత్పన్నమగును. మౌల్వీ సయ్యద్ ముహమ్మద్ సర్వర్ షాహ్ గారిట్లు నాతో తెలిపినారని హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారు వ్రాసిరి. ఒక సారి హజ్రత్ ఖలీఫా అవ్వల్ రజియల్లాహు అన్‌హు గారికి ఒక ఉత్తరము వచ్చినది. కొందరు బొడ్డు క్రింద చేతులు కట్టుకుంటారు. కొందరు మధ్యలో కట్టుకుంటారు. మరికొందరు చాలా పైన చేతులు కట్టుకుంటారు. కనుక నమాజ్ కొరకు నిలబడినప్పుడు అసలు చేతులు ఎక్కడ కట్టుకోవలెనని ఆ ఉత్తరములో వ్రాసియుండెను. బొడ్డు పైన చేతులు కట్టుకునే గురించి ఏదైనా సరియైన హదీసు లభించవచ్చునా అని కూడ అందులో అడగబడెను. హజ్రత్ మౌల్వీ గారు ఈ ఉత్తరమును హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు చూపి దీని గురించి లభించే హదీసులు సందేహాస్పదమైనవని వేడుకొనిరి. మీరు అన్వేషించండి! తప్పక లభించునని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనిరి. ఇంకా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. మా చుట్టు మొదట్లో హనఫీలు యున్నను బొడ్డు క్రింద చేతులు కట్టుకోవడం నాకు ఇష్టము లేకుండెను. బొడ్డు పైన చేతులు కట్టుకోవాలనే స్వభావము ఎల్లప్పుడు సూచించినది. మా స్వభావము ఎటు కలుగునో దానిని హదీసులో వెతికినచో తప్పక లభించునని చాలా సార్లు అనుభవమైనది. నా స్వభావము చెప్పుచున్న విషయము హదీసులలో లభించును. కనుక మీరు వెతకండి. తప్పక లభించునని వారనిరి. మౌల్వీ సర్వర్ షాహ్ గారిట్లనిరి కనుక మౌల్వీ గారు వెళ్లి ఇంకా అర్ధ గంట గడవక ముందే ఎంతో సంతోషంగా ఒక పుస్తకము చేతిలో పట్టుకొని వచ్చి ఇట్లు తెలిపిరి. హదీసు లభించినది. ఇద్దరు మహానులు ప్రస్తావించిన హదీస్ అది. అనగా హజ్రత్ అబూబకర్ రజి., హజ్రత్ ఉమర్ రజి. ఇద్దరు ఇందులో ఏకాభిప్రాయముతో యున్నందున ఎలాంటి సందేహము లేదు.

అత్తహియ్యాత్ సమయములో 'సబాబ' వ్రేలు (చూపుడు వ్రేలు) ను ఎందుకు లేపుతారని ఒక వ్యక్తి ప్రశ్నించెను. బదులుగా వారిట్లనిరి. మూర్ఖత్వ కాలములో ప్రజలు దూషించుటకు ఈ వ్రేలును లేపేవారు. అందుకే దాని పేరు 'సబాబ' అని పడిపోయినది. అనగా దూషించే వ్రేలు. అల్లాహ్ తఆలా అరబ్‌ను సంస్కరించెను. ఆ అలవాటును తొలగించి దేవున్ని ఒక్కడు, సాటి లేనివాడని చెప్పేటప్పుడు ఈ వ్రేలను లేపవలెనని చెప్పెను. తద్వారా ఆ ఆరోపణ తొలగిపోవును. అనగా దూషించే వ్రేలు అని నామకరణం చేయబడిన ఆ వ్రేలు సాక్ష్యమిచ్చు వ్రేలుగా మారిపోయెను. ఇదే విధముగా అరబ్బులు ఐదు పూటలు మద్యము సేవించేవారు. అందుకు బదులుగా ఐదు నమాజులను విధించెను.

అనంతరం రకూ, సజ్దాహ్‌లో ఖుర్‌ఆన్ దుఆలు చదువుట గురించి ప్రశ్న తలెత్తెను. రుకూ, సజ్దాహ్‌లో ఖుర్‌ఆన్ దుఆలను చదువుట గురించి తెలుపగలరని మౌల్వీ అబ్దుల్ ఖాదిర్ లుధ్యాన్వీ గారు అడిగిరి. వారిట్లనిరి. సజ్దాహ్, రుకూ వినయ స్థితులు. అల్లాహ్ తఆలా వాక్యము గొప్పదనమును ఆశించును. ఇంతేకాక రుకు లేదా సజ్దాహ్‌లో ఖుర్‌ఆన్ దుఆలను ఆఁహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం చదివినట్లు హదీసులలో కూడ ఎక్కడా రుజువు కాలేదు.

సజ్దాహ్ అతి వినయ స్థితి అయినప్పుడు సజ్దాహ్‌లో ఖుర్‌ఆన్ దుఆలు ఎందుకు చదువకూడదని హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని రజి.తో ఒకరు ప్రశ్నించిరి. సజ్దాహ్‌లో ఖుర్‌ఆన్ దుఆలు చేదవాలనే నేను విశ్వసించేవాడిని. కాని

సజ్దాహ్‌లో ఖుర్‌ఆన్ దుఆలను చదువుట సముచితం కాదని తెలిపినట్లు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి ఒక సూచన తరువాత లభించినది. ఇదే విధముగా ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్‌లో కూడ ఈ అంశముతో కూడిన ఒక హదీసు లభించినది. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో ఒక విషయము లభించినపుడు దానికి వ్యతిరేకంగా మరో పద్ధతిని అవలంభించుట మంచిది కాదు. అది మనకు అర్థమైనా కాక పోయినా ఆదేశము ప్రకారము మనము నడుచుకోవలెను.

ఒక వ్యక్తి వచ్చి రకూలో చేరినచో అతని రకాతు పూర్తి అయినట్లా కానట్లా అనే ప్రస్తావన వచ్చెను. హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. ఫాతిహా అధ్యాయము చదవనిదే నమాజ్ పూర్తి కాదని మా విశ్వాసము. వ్యక్తి ఇమామ్ వెనుక యున్నను లేదా వ్యక్తిగతంగా అయినను ఫాతిహా అధ్యాయము చదవవలెను. ఇమామ్ నిదానంగా చదువవలెను. తద్వారా వెనుక యున్న వ్యక్తి వినవచ్చును, చదవవచ్చును. లేదా ప్రతి సూక్తి తరువాత వెనుకయున్న వ్యక్తి చదివేంత సమయము ఇమామ్ ఆగవలెను. ఏది ఏమైనప్పటికి వెనుక యున్న వ్యక్తికి విని చదివేంత గడువు ఇవ్వవలెను. ఫాతిహా అధ్యాయము చదువుట తప్పనిసరి. ఎందుకనగా అది గ్రంథమునకు తల్లి వంటిది. వచ్చి ముందుగానే చేరాలని పూర్తిగా ప్రయత్నించినను రుకు కంటె ముందు రాలేక రుకులో చేరినను అతను ఫాతిహా అధ్యాయము పొందకున్నను అతని రకాతు పూర్తి అయినట్లే. రుకు పొందిన వ్యక్తి రకాతు అయినదని హదీసులో గలదు. కాని ఉద్ధేశపూర్వకముగా ఆలస్యము చేసి ఆలస్యముగా జమాఅత్‌లో చేరిన వ్యక్తి నమాజే వృథా అయిపోవును.

నమాజులో ఇమామ్ వెనుక అల్‌హందు చదవని వ్యక్తి నమాజ్ అగునా కాదా అని మరో వ్యక్తి ప్రశ్నించెను. హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. నమాజ్ అయితదా కాదా అని ప్రశ్నించకూడదు. నమాజులో ఇమామ్ వెనుక అల్‌హందు చదవాలా వద్దా అని ప్రశ్నించవలెను. తప్పక చదవాలని మేమందుము. అయితదో కాదో దేవునికి తెలుసు. హనఫీలు చదవరు. వేలాది దైవ మిత్రులు హనఫీ పద్ధతిని పాటిస్తారు. ఇమామ్ వెనుక అల్‌హందు చదవరు. వారి నమాజ్ కానపుడు వారు దైవ మిత్రులు ఎలా అయినారు ? ఇమామె ఆజమ్‌తో మాకొక ఆధ్యాత్మిక పోలిక యున్నందున మేము ఇమామె ఆజమ్‌ను ఎంతో గౌరవిస్తాము. కనుక నమాజ్ కాదని మేము చెప్పలేము. ఆ కాలములో అన్ని హదీసులు వ్రాయబడలేకుండెను. ఇప్పుడు తెలిసిన రహస్యము అప్పుడు తెలియలేదు. కనుక వారి దోషమేమి లేదు. ఇప్పుడీ సమస్య పరిష్కరించబడినది. ఇప్పుడు చదవని వ్యక్తి నమాజ్ ఆమోద దశకు చేరదు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. కొన్ని సార్లు జుహర్–అసర్ లేదా మగ్రిబ్–ఇషా నమాజులు కలిపిచదువుతారు. తరువాత వచ్చేవారికి సరిగ్గా తెలియదు. హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని రజి. ఇట్లు తెలిపిరి. ఇమామ్ అసర్ నమాజ్ చదివించుచున్నప్పుడు జుహర్ నమాజ్ ఇంకా చదవాల్సిన ఒక వ్యక్తి మస్జిదునకు వచ్చినచో లేదా ఇమామ్ ఇషా నమాజ్ చదివించుచున్నప్పుడు మగ్రిబ్ నమాజ్ ఇంకా చదవాల్సిన ఒక వ్యక్తి మస్జిదునకు వచ్చినచో మొదట అతడు జుహర్ విడిగా చదివి ఇమామ్‌ను అనుసిరించాలి లేదా ముందుగా మగ్రిబ్ నమాజ్ చదివి అనంతరం ఇమామ్‌ను అనుసరించాలని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం చెప్పినట్లు నేను స్వయముగా విన్నాను.

రెండు నమాజులు కలిపి చదివే స్థితిలో ఎవరైనా మస్జిదులోకి వచ్చినప్పుడు నమాజ్ అగుచున్నచో దాని గురించి కూడ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఆదేశము ఇట్లు గలదు. అసర్ నమాజ్ అగుచున్నదని అతనికి తెలిసినచో ముందుగా అతడు జుహర్ నమాజ్ విడిగా చదవవలెను. అనంతరం ఇమామ్‌తో పాల్గొనవలెను. ఇదే విధముగా ఇషా నమాజ్ అగుచున్నదని అతనికి తెలిసినచో ముందుగా మగ్రిబ్ నమాజ్ చదువుకొని అనంతరం ఇమామ్‌తో పాల్గొనవలెను. ఏ నమాజ్ అగుచున్నదో అతనికి తెలియకపోయినచో జమాఅత్‌తో అతడు పాల్గొనవలెను. ఈ పరిస్థితిలో ఇమామ్ చదివిన నమాజే అతని నమాజు అగును. తరువాత అతను తన మొదటి నమాజును పూర్తి చేసుకోవలెను. ఉదాహరణకు ఇషా నమాజ్ అగుచున్నప్పుడు ఒక వ్యక్తి మస్జిదులోకి వచ్చినచో ఇషా నమాజ్ అగుచున్నదని అతనికి తెలిసినచో మొదటగా మగ్రిబ్ నమాజ్ చదువవలెను. అనంతరం ఇమామ్‌తో పాల్గొనవలెను. కాని ఏ నమాజ్ అగుచున్నదో తెలియనిచో అతని ఇషా నమాజ్ అగును. తరువాత మగ్రిబ్ నమాజ్ విడిగా చదువుకోవలెను. ఇదే స్థితి అసర్ గురించి కూడ వర్తించును.

షేఖ్ యాఖూబ్ అలి ఇర్ఫాని గారిట్లు తెలిపిరి. ఆరంభము నుండే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సున్నతులు, నఫిల్లు గృహములోనే చదువుకొనేవారు. ఫర్జ్ నమాజ్ జమాఅత్‌తో మస్జిదులోనే చదివేవారు. ఇదే పద్ధతిని వారు చివరి వరకు పాటించిరి. హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ అవ్వల్ రజియల్లాహు తఆలా అన్‌హు ఒకసారి పవిత్ర ఖుర్‌ఆన్ బోధించుచుండగా ఇట్లనిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఫర్జ్ నమాజ్ తరువాత వెంటనే ఇంట్లోకి వెళ్లిపోయేవారని, ఇలాగే అధికంగా నేను కూడ చేస్తాను. దీని వలన కొందరు అవివేక పిల్లలకు ఫర్జ్ నమాజ్ అయినపోయిన వెంటనే మస్జిద్ నుండి వెళ్లిపోయే అలవాటు పడినది. వారు సున్నత్ చదవడం లేదని మా అనుమానం. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇంట్లోకి వెళ్లి మొదటగా సున్నతులు చదివేవారని, నేను కూడ అలాగే

చేస్తానని ఇటువంటి వారు గుర్తుంచుకోవలెను.

ఇమామత్‌ను ఒక వృత్తిగా చేపట్టవచ్చునా లేదా అనే ప్రశ్న వచ్చెను. ఇట్లనిరి. ఇమామత్‌ను వృత్తిగా చేపట్టినవారు ఐదు పూటలు వెళ్లి నమాజ్ చేయరు. అదొక దుకాణము. ఆయా సమయములలో వెళ్లి తెరుస్తారు. ఈ దుకాణముపైననే వారు, వారి కుటుంబ సభ్యులు పూట గడుపుతారు. ఇది ఇమామత్ కాదు. నిషేధితమైన, అసహ్య పద్ధతి. వృత్తిపరంగా నమాజ్ చదివించేవారి వెనుక నమాజ్ సముచితము కాదని నా అభిప్రాయము. వారు వారాంతపు పారితోషికము లేదా వేతనము పొందుటకు నమాజ్ చదివించుచున్నారు. దొరకనిచో విడిచిపెట్టవలెను.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను అవిశ్వాసులని ప్రకటించేవారి వెనుక నమాజ్ చదువుట గురించి ఇట్లనిరి. నిరాకరించే, తిరస్కరించేవారు నాశనమగు జాతులు. నా జమాఅత్‌లోని వ్యక్తి వారి వెనుక నమాజ్ చదివే స్థాయి వారికి లేదు. జీవితుడు మృతుని వెనుక నమాజ్ చదవవచ్చునా. ఒక అవిశ్వాసి, తిరస్కృతుని వెనుక మీరు నమాజ్ చేయుట గట్టి నిషేధమని అల్లాహ్ తఆలా నాకు తెలిపెను. మీలోని వ్యక్తే మీ ఇమామ్ కావలెను. దీని వైపే బుఖారి హదీసులో ఇమామకుమ్ మిన్‌కుమ్ అనే సంజ్ఞ గలదు.

ఇద్దరు వ్యక్తులు బైఅత్ చేసిరి. అహ్మదియేతరుల వెనుక నమాజ్ చదవడం సమంజసమా కాదా అని ఒకరు ప్రశ్నించిరి. వారు మమ్ములను అవిశ్వాసులని అంటారు. మనము అవిశ్వాసులము కాదు. కనుక ఆ అవిశ్వాసము తిరిగి వారిపైనే పడును. ముస్లిమును కాఫిర్ అనే వ్యక్తి స్వయముగా కాఫిర్ అగును. ఇందుకే ఇటువంటి వారి వెనుక నమాజ్ సమంజసము కాదు. ఏమియు అనకుండా మౌనముగా యున్నవారు కూడ వీరిలోనే పరిగణిపంబడతారు. ఎందుకనగా వారు మనసులో వ్యతిరేక భావము కలిగియున్నందునే మనలో ప్రవేశిడం లేదు. మీరు వారితో కలిసిపోయినచో అల్లాహ్ తఆలా ప్రత్యేక దృష్టి మీపై యుండదు. పవిత్రమైన జమాఅత్ విడిగా యున్నప్పుడే అభివృద్ధి చెందును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం మనతో ఆశించిన విధముగా ఈ జమాఅత్ స్వచ్ఛమైన సభ్యులుగా అల్లాహ్ తఆలా మనలను చేయుగాక!

ఖుత్బా జుమా చివరలో హుజూరె అన్వర్ ఇట్లనిరి. అల్‌జజాయిర్ అహ్మదీయుల కొరకు దుఆ చేయగలరిన చెప్పదలచితిని. ఇది క్రొత్త జమాఅత్. వీరిలో అధికులు క్రొత్తగా బైఅత్ చేసినవారే. కాని గట్టి విశ్వాసులు. ఇప్పుడు ప్రభుత్వము తరపున చాలా కఠినముగా వ్యవహరించుచున్నారు. అనవసరంగా వాజ్యములు మోపుచున్నారు. కొందరిని కారాగారములో కూడ బంధించినారు. దాయిష్ వలెనే వీరు కూడ అని ఆరోపించుచున్నారు. నవూజుబిల్లాహ్. న్యాయమూర్తులు కూడ తీవ్ర అన్యాయము చేయుచున్నారు. అహ్మదియ్యత్‌ను విడిచినచో నేను నిన్ను ఇప్పుడే విడిచిపెట్టుతానని ఒక అహ్మదీతో న్యాయమూర్తి అన్నప్పుడు నేను చనిపోయినా అహ్మదియ్యత్‌ను విడిచిపెట్టను, విశ్వాసమును విడిచిపెట్టను, ఎందుకనగా ఇదే సరియైన ఇస్లాం అని నాకిప్పుడు తెలిసినదని అతడనెను. నీవిలా సమాధానము చెప్పినందుకు నేను నిన్ను జీవితాంతం కారాగారములోనే యుంచుతాను. కారాగారములోనే నీవు మరణింతువని న్యాయమూర్తి అనెను. మీరు చేయదలచినదేదో చేయగలరని అతడనెను. ఇవి నేటి పరిస్థితులు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. అల్లాహ్ తఆలా అహ్మదీయుల కొరకు అక్కడ సౌలభ్యములను కలిగించుగాక! వారికి స్థిరత్వము కూడ ప్రసాదించుగాక! ఇస్లాం వ్యతిరేకులు, అహ్మదియ్యత్ వ్యతిరేకులైన శత్రువులు చేయుచున్న పనులను వారిపైనే తిరిగి వేయుగాక! ఆ క్రూరుల నుండి ప్రతి అహ్మదీని రక్షించుగాక! (ఆమీన్)

☆☆☆

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Hafiz Syed Rasool Niyaz, Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

To,

..........................................................

..........................................................

..........................................................